

# ఎ కేస్ హిస్టరీ ఆఫ్ మిసెస్ రావ్

– 'పుష్యమి'

మిసెస్ రావ్ అంటే ఆ కాలనీలో తెలియనివారెవరూ లేరు. అప్పుడే ఫ్రిజ్‌లో నుంచి తీసిన పుచ్చకాయలా గుండ్రంగా, తాజాగా వుంటుంది.

ఎండ వేడి పడకుండా సదా ఎయిర్ కూలర్ గాలి పీలుస్తుండటం వల్ల తెల్లగా వుంటుందామె రంగు.

పొద్దున్నే తెల్లారు జామున లేచి మొగుడితో బాటు కలిసి మార్నింగ్ వాక్‌కి వెళ్ళి వస్తుంది.

వయసు నలభై సంవత్సరాలకు దగ్గరపడటం వల్ల ఆహారపు అలవాట్ల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది మిసెస్ రావ్.

పొద్దునే రెండు ఇడ్లీ తింటుంది. మధ్యాహ్నం ఆకు కూరలు, కూరగాయలు మినహా మాంసాహారాల జోలికి పోదు. కాఫీ, టీలు మానేసింది. రాత్రికి నూనె వేయకుండా కేవలం కాల్చిన చపాతీలు తింటుంది.

మాంసాహారం మానెయ్యడానికి కారణం- ఆరోగ్యం గురించే కాదు, పెరిగిన రేట్లతో అవి కొనే పొజిషన్‌లో లేరు మిసెస్ రావ్ ఫ్యామిలీ.

పని మనిషి లాంటి లగ్జరీ అలవాట్లు బొత్తిగా లేవు. అందువల్ల సమస్తమైన యింటి పనులు చేసుకోవడం నల్లేరు మీద బండి నడక అయింది మిసెస్ రావ్‌కి.

కొలెస్ట్రాల్ రాకుండా వుండేందుకు ఎడాపెడా ఇరుగు పొరుగు వాళ్ళతో మాట్లాడటం వల్ల కలివిడి మనిషిగా పేరొచ్చింది.

అందువల్ల కాలనీలో నలుగురికి మిసెస్ రావ్ పేరు తెలిసింది.

మిస్టర్ రావ్ అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు ( ఈ చివరి మాట అనుమానస్పదం-అక్కడ జీతం తీసుకుంటున్నాడు కాబట్టి అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో వుంటున్నాడనడం సబబు)

ఇరుగు పొరుగు వాళ్ళకు ఏ సహాయం అయినా చేసే అలవాటు వల్లే మిసెస్ రావ్ జీవితంలో యింత కథ జరిగింది.

***

కాలనీలో రోడ్ మీద పడ్డ అరటి తొక్కపై పొరబాటున కాలేసి, జర్రున జారిపడ్డారు గంగాబాగీరధి సమానురాలైన ఎదిరింటి బామ్మగారు.

కాలు విరిగిందని హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. ఫ్రాక్చర్‌కి ప్లాస్టర్ వేశారుగాని-మూడు నాలుగు రోజుల పాటు హాస్పిటల్‌లోనే వుంచాలన్నారు.

బామ్మగారి కోడలు తప్ప, హాస్పిటల్‌లో వుండేందుకు మరో వ్యక్తి లేరు.

ఆవిడ వచ్చి మిసెస్ రావ్‌ని ప్రాధేయపడింది.

– కాస్త హాస్పిటల్‌లో తనతో తోడుగా వుండమని. మిసెస్ రావ్ కాదనలేకపోయింది.

***

అది నగరంలో పంచ నక్షత్రాల హాస్పిటల్.

అక్కడి డాక్టర్లందరికి విదేశీ సర్టిఫికేట్లు తప్ప స్వదేశీ సర్టిఫికేట్లు తక్కువ. పార్కింగ్ ప్లేసులో స్కూటర్ల కన్నా కారులే ఎక్కువ. హోటల్స్‌లో లాగా అందమైన రిసెప్షనిస్ట్ చిరునవ్వుతో పలకరిస్తుంది. విజిటర్స్ లాంజిలో అతి ఖరీదైన, మెత్తటి సోఫాలు వుంటాయి. వారు చదువుకోవడానికి అన్నీ ఆంగ్లపత్రికలే!


రిసెప్షనిస్ట్ డ్యూటీలు మారుతుంటాయి. ఆ హాస్పిటల్‌లో డాక్టర్ దగ్గరికి వెళ్ళాలంటే కనీసం కొన్ని నెలల ముందుగా అప్పాయింట్‌మెంట్ తీసుకోవాలి. కాలి గోర్ల నుంచి తల వెంట్రుకల వరకూ రకరకాల స్పెషలిస్ట్‌లున్నారు. రిసెప్షన్‌లో నాలుగయిదు కంప్యూటర్స్ వున్నాయి సూపర్‌బజార్‌లోలాగా.


దాదాపు అయిదారు అంతస్తుల బిల్డింగ్ అది. నాన్ ఎసి రూమ్‌లన్నీ ఫస్ట్ ఫ్లోర్‌లోనే. మళ్ళీ ఎసి రూమ్స్‌లో గ్రేడ్స్-విజిటర్స్ కోసం మంచాలు వున్నవి లేనివి.

ఎసి రూమ్స్ అన్నింటిలోనూ టివిలు వున్నాయి. ఎక్కువ శాతం కలర్ టివిలు. ఛానల్స్ కనెక్షన్ వుంటే రూమ్ రెంట్ వేరు. దూరదర్శన్ మాత్రమే అయితే రేటు తగ్గుతుంది.

ఈ వ్యవహారం చూసి విస్తుపోయింది మిసెస్ రావ్. "ఇది వరకు డాక్టర్లు పేషంట్‌కి ప్రశాంతత వుండాలని, నిశ్శబ్దం పాటించమనేవారు. ఇప్పుడు పేషంట్ కన్నా కూడా వున్నవాళ్ళ ఎంటర్‌టైన్‌మెంట్‌కి ప్రాధాన్యత యిస్తున్నారు" అని ఆశ్చర్యపోయింది మిసెస్‌రావ్.

"మరే – ఈ మాత్రం కాలక్షేపం లేకపోతే పేసంట్స్‌తో పాటు మనమూ చచ్చిపోమూ" అంది బామ్మగారి





కోడలు.

"పోనూ పోనూ ఆపరేషన్ థియేటర్స్‌లో మత్తుమందు యివ్వడం మానేసి, ఛానెల్‌లో సినిమా చూపించి, సరిపెట్టేస్తారేమో?" మరోసారి ఆశ్చర్య పోయింది మిసెస్ రావ్.

"అలాంటిదేమన్నా చేస్తే ముందు ఈ హాస్పిటల్ వాళ్ళే చేస్తారు. ఇంత వరకూ ముక్కు స్పెషలిస్ట్ గురించి విన్నాంగాని, ఈ హాస్పిటల్‌లో ముక్కుపుటాలకి సెపరేట్ డాక్టర్లు వున్నారు" అన్నది బామ్మగారి కోడలు.


"ఆ!" అని నోరు వెళ్ళబెట్టింది మిసెస్ రావ్.

***

మిసెస్ రావ్‌కి ఒకటిన్నర రోజు పాటు యింటికి వెళ్ళే అవకాశం చిక్కలేదు. బామ్మగారికి తోడుగా హాస్పిటల్‌లో వుండిపోవలసి వచ్చింది.

బామ్మగారి కోడలు క్యారేజి తీసుకు వచ్చింది కాని, మిసెస్ రావ్‌కి హాస్పిటల్‌లో ఏమీ తినబుద్ధి కాలేదు. కాఫీ నాలుగయిదుసార్లు తాగింది. బ్రెడ్ ముక్కలు తింది. నిద్రపోకుండా టీవీలో సినిమాలు చూసింది. రెండో రోజు మధ్యాహ్నం ఇంటికి వెళ్దామని మూడో ఫ్లోర్‌లోనుంచి గ్రౌండ్‌ఫ్లోర్‌లోకి లిఫ్ట్‌లో వెళ్తుండగా జరిగిందా సంఘటన. లిఫ్ట్‌లోకి ఎక్కగానే కళ్ళు తిరిగినట్లయింది మిసెస్ రావ్‌కి. నుదుటన చిరుచెమటలు అలుముకున్నాయి. క్షణం కూడా తిరగక మునుపే లిఫ్ట్‌లో దభీమని కిందపడింది.

సహ లిఫ్ట్‌వాసులు కంగారు పడ్డారు. బామ్మగారి కోడలు పరుగు పరుగున వచ్చింది. అపాయింట్‌మెంట్ లేకుండా పరీక్షించడం ఆ హాస్పిటల్ సంప్రదాయం కాదుగాని, ఎమర్జెన్సీ కేసు కింద ట్రీట్ చేశారు. మిస్టర్ రావ్ ఆఫీసునుంచి ఉరుకులు పరుగుల మీద వచ్చి పడ్డాడు.




"బ్రెయిన్ ట్యూమర్" అన్నాడు న్యూరాలజిస్ట్. "నో నో! బ్లడ్ షుగర్ అయివుండవచ్చు. రక్తంలో షుగర్ పర్సంటేజీ సడన్‌గా డౌన్ అయిపోతేనే యిలా పడిపోతారు" అన్నాడు డయాబెటిక్ స్పెషలిస్ట్.

"నాటెటాల్! హార్ట్‌లో ఏదో ప్రాబ్లెమ్-బ్లడ్ ఫంక్షనింగ్ సరిగా జరగక యిలా" అని గంభీరంగా చెప్పాడు కార్డియాలజిస్ట్. స్పెషలిస్ట్‌ల వాదోపవాదాలు విని మిస్టర్ రావ్, బామ్మగారి కోడలు కంగారు పడ్డారు. ఈ లోగా హాస్పిటల్ కన్వీనర్ వచ్చి చిరునవ్వుతో అందరిని పలకరించి, "హైపర్‌గ్లైసేమియా, వెర్టిగో నుంచి కేన్సర్ వరకూ ఏదైనా కావచ్చు. లేదా రెండు మూడు రకాల రోగాలు కలిపి వుండవచ్చు. క్షుణ్ణంగా పరీక్షలు చేయిస్తేగాని చికిత్స ప్రారంభించ కూడదు" అన్నాడు.

స్పెషలిస్ట్‌లంతా "భేషుగ్గా వుంది ఆలోచన" అని తలలూపారు.

యూరిన్ టెస్ట్, బ్లడ్ టెస్ట్ (నాలుగయిదు రకాలు), ఇసిజి, ఎక్స్‌రే, సిటి స్కానింగ్ ఇత్యాది పరీక్షలన్నీ చేశారు. ఈలోగా మిసెస్ రావ్‌కి మెలకువ వచ్చింది. తంతు అంతా గమనించి కాస్తంత కంగారుపడింది. మిస్టర్ రావ్ ధైర్యం చెప్పాడు.

సాయంత్రానికి రిపోర్టులు వచ్చాయి- అంతా నార్మల్.

బహుశా రాత్రి నిద్రపోకపోవడం వల్ల, సరిగా తిండి తినకపోవడం వల్ల అలా జరిగి వుండొచ్చని నిర్ధారించారు డాక్టర్లు. ఎందుకయినా మంచిదని, బలానికి టాబ్లెట్స్, టానిక్కులు రాశారు. యథాలాపంగా హాస్పిటల్ బిల్లులు చూసిన మిసెస్ రావ్ కళ్ళు తిరిగి పడిపోయింది. ఆమెని పరీక్ష చేసిన డాక్టర్ పెదవి విరిచాడు. "బాడ్ లక్! ఆవిడ ఈ టెస్టుల గురించి, బిల్లుల గురించి అనవసరంగా వర్రీ అయినట్లుంది. బిపి చాలా ఎక్కువగా వుంది. మళ్ళీ మరొక్కసారి కిడ్నీ, హార్ట్ టెస్టులు చేయించాలి. రక్తపోటు అంటే జీవితాంతం మందులు వాడాల్సిందే!" అన్నాడా డాక్టర్.

మిస్టర్ రావ్‌కి కళ్ళు తిరుగుతున్నట్లు అన్పించి, తమాయించుకుంటూ కుర్చీ గట్టిగా పట్టుకున్నాడు. "దేవుడా-దేవుడా! నాకీ హాస్పిటల్‌లో కళ్ళు తిరగకుండా చూడు" అని ప్రార్థించసాగాడు మిస్టర్ రావ్.

